ఆంధ్ర ప్రదేశ్
మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాల్లో
విజ్ఞాన్ పత్రికకు
విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 9951775293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 63 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శుక్రవారం 03 ఏప్రిల్ 2026 పేజీలు : 04 వెల : 02

## ఈ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరగదు

- ★ శేషగిరమ్మ సమస్యను వింటున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్
- ★ ఐదు సెంట్ల భూమి, ఇంటిని సీఆర్‌డీఏ లాగేసుకుంది
- ★ భూమికి భూమి ఇస్తామని.. ఇంటికి పరిహారం ఇస్తామని నమ్మబలికింది
- ★ మేం అంగీకరించకుండానే మా భూమి తీసుకుంది
- ★ దీనిపై నా భర్త పోరాడి కేన్సర్‌తో చనిపోయారు
- ★ 90 ఏళ్ల వయసులో మతిస్థిమితం లేని మనవరాలితో బతుకీడుస్తున్నా
- ★ మాజీ సీఎం జగన్‌ను కలిసి గోడువెళ్ల బోసుకున్న రాయపూడి వాసి నెల్లూరి శేషగిరమ్మ
- ★ న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించండి
- ★ ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులకు వైఎస్ జగన్ సూచన
- ★ కొత్తగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు



ఈ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరగదని 90 ఏళ్ల వృద్ధురాలు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎదుట కన్నీటి పర్యంతమైంది. సీఆర్‌డీఏ అధికారులు తనకున్న కాస్త భూమిని లాక్కుని జీవిత చరమాంకంలో అధోగతి పాల్జేస్తున్నారని గోడువెళ్లబోసుకుంది. మతిస్థిమితం లేని మనుమరాలితో అష్టకష్టాలు పడుతుంటే.. తన భూమిని వెనక్కి ఇవ్వకుండా ప్రభుత్వం ముప్పుతిప్పలు పెడుతోందని వాపోయింది. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామానికి చెందిన నెల్లూరి శేషగిరమ్మ కలిసి తన ఆవేదనను వెళ్లబోసుకుంది.



## అమరావతి ఇక శాశ్వతం!

- ♦ అమరావతిపై జగన్ విద్వేషానికి పరాకాష్ఠ 'మావిగన్'
- ♦ త్వరలోనే కర్నూలులో హైకోర్టు బెంచ్
- ♦ ఎన్డీయే నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు
- ♦ వైసీపీది నీతిమాలిన రాజకీయం
- ♦ అమరావతి.. ఆంధ్రుల ఆత్మగౌరవ చిహ్నం
- ♦ ప్రపంచం చూసేలా అభివృద్ధి చేస్తాం
- ♦ ఈ విజయం వెనుక ఎన్నో కన్నీళ్లు: మాధవ్
- ♦ ఇక రాజధాని అభివృద్ధి రయ్‌రయ్: నాదెండ్ల
- ♦ ఇది ఆంధ్రప్రదేశ్ విజయం: నాదెండ్ల మనోహర్

ప్రజా రాజధాని అమరావతి, దాని నిర్మాణం కోసం రైతులు చేసిన త్యాగాలు శాశ్వతంగా ఉంటాయని, ఇకపై అమరావతిని ఎవరూ టచ్ చేయలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చరిత్ర ఉన్నంత వరకు అమరావతి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడం ద్వారా తిరుగులేని శాసనాన్ని లిఖించారని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెంలో గురువారం సాయంత్రం నిర్వహించిన 'అమరావతి విజయోత్సవ సభ'లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అమరావతి బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపిన ఈ రోజు.. ప్రజాస్వామ్య గొప్పతనాన్ని, ప్రజల సంకల్ప బలాన్ని చాటి చెప్పిన రోజు' అని పేర్కొన్నారు. అనేక కుట్రలను దాటుకుని అమరావతిని రక్షించుకున్నామని, ప్రజా రాజధానిని సాధించుకున్నామన్నారు.



## ఏపీ రాజధాని శాశ్వతం

- ★ పార్లమెంటు చట్టం.. తిరుగులేని శాసనం
- ★ అనేక కుట్రలు దాటుకుని అమరావతికి రక్షణ.. ఇది ప్రజా విజయం
- ★ అమరావతి రైతుల 1631 రోజుల ఉద్యమం ఓ చరిత్ర
- ★ బిల్లును వ్యతిరేకించిన దేశంలోని ఒకే ఒక్క దిక్కుమాలిన పార్టీ వైసీపీ
- ★ 'చట్టబద్ధత'ను ఓర్వలేకే జగన్ డ్రామాలు
- ★ వాకౌట్ చేసిన ఆ పార్టీని బ్లాకౌట్ చేయాలి
- ★ మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించిన రాజ్యసభ
- ★ రాష్ట్రపతి ఆమోదం పొందిన వెంటనే చట్టరూపం
- ★ 149 నిమిషాలపాటు చర్చ
- ★ 10 పార్టీల నుంచి మాట్లాడిన 16 మందీ మద్దతు
- ★ వ్యతిరేకించి, వాకౌట్ చేసిన వైకాపా
- ★ పార్లమెంటు చట్టం తిరుగులేని శాసనం: సీఎం చంద్రబాబు

అమరావతిని పెద్దల సభ ఆశీర్వదించింది. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడానికి కేంద్ర హోం శాఖ తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన బిల్లు–2014 సవరణ బిల్లును రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. భవిష్యత్తులో వచ్చే ఏ ప్రభుత్వాలూ రాజధానిపై పిల్లిమొగ్గలేసి ప్రజాజీవితాలతో ఆడుకోకూడదన్న బలమైన సందేశాన్నిచ్చింది.

అనుకున్నది అనుకున్నట్లుగానే జరిగింది. రాజధాని 'అమరావతి'కి పార్లమెంటు సాక్షిగా చట్టబద్ధమైన రక్షణ లభించింది. 2014లో చేసిన రాష్ట్ర విభజన చట్టంలోనే... 'ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతి ఉంటుంది' అనే సరికొత్త సవరణను పార్లమెంటు ఆమోదించింది. బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన బిల్లును గురువారం రాజ్యసభ కూడా ఆమోదించింది. కేసీఆర్ అధ్యక్షుడుగా ఉన్న బీఆర్ఎస్ కూడా ఈ బిల్లును స్వాగతించడం విశేషం. 'ఆమోదం సంపూర్ణం' కాగానే రాష్ట్రవ్యాప్తంగా 'కూటమి' నేతలు, ప్రజలు సంబరాలు చేసుకున్నారు.

రాష్ట్ర రాజధానికి పార్లమెంటులో చట్టబద్ధత ఓ తిరుగులేని శాసనం. అమరావతి ఇకపై అన్‌స్టాపబుల్.. అద్వితీయం.. అజేయం.. అజరామరం. రాజధాని అమరావతి, దాని నిర్మాణం కోసం రైతులు చేసిన త్యాగాలు ఇకపై శాశ్వతంగా ఉంటాయి. ఇది అమరలింగేశ్వరుడు కొలువైన నేల. ప్రసిద్ధ బౌద్ధ స్థూపం ఓవైపు.. కృష్ణమ్మ, దుర్గమ్మ మరోవైపు అండగా ఉన్నారు. ఇంత మంది తోడుగా ఉండగా, అపజయం అనేది ఉండదు.

పార్లమెంటులో అమరావతి బిల్లుకు దేశంలోని అన్ని పార్టీలు మద్దతుగా నిలిచినా.. ఒకే ఒక్క దిక్కుమాలిన పార్టీ వైసీపీ వ్యతిరేకించింది. ప్రజలు, రాష్ట్ర భవిష్యత్తు గురించి వారికి పట్టదు. రాష్ట్రానికి ఆ పార్టీ పీడ విరగడవ్వాలి. అమరావతిని చంపాలనుకున్న వైసీపీకి భవిష్యత్తు లేకుండా చేయాలి. రాజధానికి చట్టబద్ధత కల్పిస్తుంటే సభ నుంచి ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ప్రజలు ఆ పార్టీని బ్లాక్ ఔట్ చేయాలి. – సీఎం చంద్రబాబు

## 99 రోజుల ప్రణాళిక ఒక దీక్ష

- ♦ అది ఓ ఉద్యమంలా సాగాలి
- ♦ సేవకులుగానే ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నాం
- ♦ అన్ని రంగాల్లో తెలంగాణను నెంబర్ వన్‌గా నిలపాలన్నదే సంకల్పం
- ♦ మీ సంపూర్ణ సహకారం కావాలి

: రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి సందేశం

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల ప్రణాళిక సాధారణ కార్యక్రమం కాదు...



## మాతో ఒప్పందానికి రావాల్సిందే

- ★ రెండూ మూడు వారాల్లో భీకరదాడులు
- ★ లేదంటే ఇరాన్ నాశనమే
- ★ ఆ దేశాన్ని తిరిగి రాతియుగం నాటికి తీసుకెళ్తాం
- ★ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు

ఇరాన్ యుద్ధానికి సంబంధించి అమెరికా నిర్దేశించుకున్న ప్రధాన లక్ష్యాలు పూర్తి కావస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గురువారం అన్నారు. ఇరాన్ ఇప్పుడు ఆర్థికంగా, సైనికంగా నాశనమైందని చెప్పారు. హోర్ముజ్ జలసంధి గుండా చమురు వెళ్లే దేశాలు అక్కడికి వెళ్లి దానిని స్వాధీనం చేసుకోవాలని కూడా తెలిపారు.



# అమరావతి ఇక శాశ్వతం..!

బుధవారం లోక్‌సభ ఆమోదం పొందిన బిల్లును గురువారం మధ్యాహ్నం హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ దీనిపై చర్చకు అనుమతిచ్చారు. తొలుత ఇందుకు రెండు గంటలే కేటాయించినా సభ్యుల ఉత్సాహంతో అది 149 నిమిషాలపాటు సాగింది. కాంగ్రెస్, భాజపా సహా మొత్తం 11 పార్టీల నుంచి 17 మంది సభ్యులు పాల్గొని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అందులో 10 పార్టీలకు చెందిన 16 మంది సభ్యులు ముక్తకంఠంతో అమరావతి బిల్లును స్వాగతించి ఆశీర్వదించారు. వైకాపా నుంచి మాట్లాడిన వైవీ సుబ్బారెడ్డి మాత్రం ఆరోపణలు చేసి వాకౌట్ చేశారు. మిగతా పార్టీల సభ్యులు ప్రాంతాలు, పార్టీలనే భేదం లేకుండా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. విభజన నాటి నష్టం ఇప్పటికైనా భర్తీ అవుతోందని సంతోషించారు. గత ప్రభుత్వ అణచివేతను ఎదుర్కొని రైతులు, మహిళలు శాంతియుత ఉద్యమాలు నిర్వహించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటినందుకు ముక్తకంఠంతో అభినందించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రశంసించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దిన ఆయన హయాంలో అమరావతి కూడా అత్యుత్తమ నగరంగా అవతరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**రేణుకాచౌదరి ప్రసంగంతో ప్రారంభం:** కాంగ్రెస్ సభ్యురాలు రేణుకాచౌదరి ప్రసంగంతో చర్చ ప్రారంభమైంది. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, భాజపా ఎంపీలు కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, పాకా వెంకట సత్యనారాయణ, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ నదీముల్ హఖ్, ఆప్ నేతలు సంజయ్‌సింగ్, సందీప్‌కుమార్ ఝా, వైకాపా నాయకుడు వైవీ సుబ్బారెడ్డి, బీజేడీ సభ్యుడు నిరంజన్ బిసి, ఆర్జేడీ సభ్యుడు సంజయ్‌యాదవ్, భారాస ఎంపీలు కేఆర్ సురేష్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, జేడీయూ నేత సంజయ్‌కుమార్ ఝా, తెదేపా సభ్యులు బీద మస్తాన్‌రావు యాదవ్, సానా సతీష్‌బాబు, శివసేన ఉద్ధవ్‌ఠాక్రే సభ్యురాలు ప్రియాంకా చతుర్వేదిలు మాట్లాడారు. వైవీ సుబ్బారెడ్డి తప్ప మిగతా అందరూ ఆంధ్రప్రదేశ్‌కు సంఘీభావం ప్రకటించారు. తెలుగుజాతి గొప్పతనం, కష్టాలను అధిగమించే తత్వాన్ని కొనియాడారు. ప్రస్తుతం కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తెదేపా బలంపైనే ఆధారపడి ఉన్నందున ఒత్తిడి తెచ్చి నిధులు సాధించుకోవాలని సూచించారు. మరికొందరు సభ్యులు భాజపా మోసగించే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. అమరావతి నిర్మాణానికి నిర్దిష్ట గడువు విధించి పూర్తి చేయాలని, భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

**దేశ ప్రజల తరఫున శుభాకాంక్షలు: రాజ్యసభ ఛైర్మన్**


చివరగా హోం శాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ సమాధానం ఇస్తూ బిల్లు ఉద్దేశాన్ని వివరించారు. దానివల్ల ఆంధ్రప్రదేశ్‌కు జరిగే ప్రయోజనాల్ని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రూపంలో కొత్త రాజధాని లభించినందుకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి సంకల్పించిన వికసిత్ భారత్ లక్ష్యాన్ని పూర్తి చేయడంలో అమరావతి, ఆంధ్రప్రదేశ్ సార్థక భూమిక పోషించాలని ఆకాంక్షించారు. ఇదో చరిత్రాత్మక సందర్భమని అభివర్ణించారు. ఆ వెంటనే రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ బిల్లుపై అభిప్రాయం కోరగా సభ్యులంతా గట్టిగా నినదిస్తూ ముక్తకంఠంతో మద్దతు పలికారు. దాంతో ఛైర్మన్ బిల్లు సభామోదం పొందినట్లు ప్రకటించారు. అన్ని పక్షాల సభ్యులు కరతాళధ్వనులతో హర్షం ప్రకటించారు. తర్వాత రాజ్యసభ ఛైర్మన్ మాట్లాడుతూ మొత్తం సభ, దేశ ప్రజల తరఫున ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. వేంకటేశ్వరస్వామి ఆశీర్వాదంతో అద్భుతమైన నూతన రాజధాని నిర్మాణం కావాలని అభిలషించారు. అమరావతి బిల్లును పార్లమెంటు ఉభయసభలు ఆమోదించినందున రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపిన వెంటనే అది చట్టరూపం సంతరించుకుంటుంది. 2024 జూన్ 2 నుంచి అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా గుర్తింపు పొందుతుంది. ఇలా ఒక రాష్ట్ర రాజధానికి ప్రత్యేకంగా చట్టపరమైన హోదా ఇవ్వడం ఇదే ప్రథమం.

# 99 రోజుల ప్రణాళిక ఒక దీక్ష

ఒక దీక్ష అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అది ఒక ఉద్యమంలా సాగాలని ఆకాంక్షించారు. పాలకులుగా కాకుండా సేవకులుగానే తాము ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని తెలిపారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్‌గా నిలపాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని పునరుద్ఘాటించారు. అందుకు మీ సంపూర్ణ సహకారం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రజలకు సందేశం పంపారు. దాన్ని గ్రామ సభల్లో అధికారులు చదివి వినిపించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సందేశంలో ఇలా.... 'ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండేండ్ల మూడునెలలైంది. ఎన్నో ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ...గత పాలకుల తప్పిదాలను సరిచేస్తూ... సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడకుండా మన ప్రభుత్వం పని చేస్తోంది. మేం పాలకులం కాదు...సేవకులం అన్న భావనతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలే కేంద్ర బిందువుగా నిత్యం శ్రమిస్తున్నాం. ప్రతి నిర్ణయంలో ప్రజల మేలు, సామాజిక బాధ్యత, రాష్ట్ర భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుంటున్నాం. ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలతో ప్రజా పాలనకు మీ ఆమోదం, మద్దతు ప్రకటించారు. మీరు ఇచ్చిన ఈ ఫలితాలు మా బాధ్యతను మరింత పెంచాయి. ప్రభుత్వ పథకాలు అంటే కాగితాలపై కాదు...ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తేవాలన్నది మా సంకల్పం. ఆ ఉద్దేశంతోనే 'ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక' పేరుతో కార్యక్రమాన్ని ప్రారంభించాం. మార్చి 6 నుంచి 99 రోజుల పాటు, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు, అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం ఒక ఉద్యమంలా సాగాలి. ఊరూ వాడా సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి అధికారి పని చేయాలి. వేగంగా ఫైళ్ల క్లియరెన్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రత, నిర్ణయాల్లో పారదర్శకత ఉండాలి. మహాలక్ష్మి పథకం, ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం జరగాలి. 'తెలంగాణ రైజింగ్– 2047' విజన్‌తో ఆర్థికంగానే కాక, అన్నీ రంగాల్లో తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలపాలన్నది మన సంకల్పం. ఈ సంకల్పంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి. క్యూర్, ప్యూర్, రేర్‌గా రాష్ట్రాన్ని వర్గీకరించుకున్నాం. వాటి పరిధిలో సేవా, తయారీ, వ్యవసాయ రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా మనం ఎదగాలి. ఈ 99 రోజుల కార్యాచరణ ఒక సాధారణ కార్యక్రమం కాదు. ఒక దీక్ష. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఒక్కటై, దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా ఎదగాలి. ఇదే నా కల. ఆ కలను సాకారం చేయడంలో ప్రతి తెలంగాణ బిడ్డ భాగస్వామి కావాలి. మీ అందరి సహకారం కావాలి' అని ప్రజలను కోరారు.

# ఈ ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరగదు

చంద్రబాబు భూ దాహం 90 ఏళ్ల వృద్ధురాలిని రోడ్డున పడేస్తే.. బలవంతపు భూదోపిడీ ఆమె భర్తను మృత్యు ఒడిలోకి నెట్టేసింది. నెల్లూరి శేషగిరమ్మ కుటుంబం రాయపూడిలో తమకున్న ఐదు సెంట్ల స్థలంలో నిర్మించుకున్న చిన్న ఇంటిలో నివసిస్తోంది. 2015లో సీఆర్‌డీఏ అధికారులు ఆ స్థలం మీదుగా రోడ్డు వెళ్తుందని.. భూమికి భూమి ఇచ్చి, ఇంటికి పరిహారం ఇస్తామని చెప్పి నమ్మబలికారు. శేషగిరమ్మ భర్త శేషగిరి రావు (100ఏళ్లు)తో తెల్ల కాగితాలపై బలవంతంగా వేలిముద్రలు తీసుకున్నారు. రెండేళ్ల తర్వాత శేషగిరమ్మ బ్యాంకు ఖాతాలో అత్యంత హీనంగా రూ.2,500 కౌలు వేశారు. దీంతో ఆందోళన చెందిన బాధితురాలి భర్త శేషగిరిరావు తన భూమిని ప్రభుత్వం తీసేసుకుందని గ్రహించి 2017లో తమకు కౌలు వద్దని, భూమిని వెనక్కి ఇవ్వాలని సీఆర్‌డీఏ కార్యాలయం చుట్టూ తిరిగి అలిసిపోయాడు. కేన్సర్‌తో బాధపడుతున్న అతడు మృతి చెందారు. కొంతకాలానికే కుమార్తె సైతం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందింది. అప్పటినుంచి మతిస్థిమితం లేని 40 ఏళ్ల మనుమరాలితో బిక్కుబిక్కుమంటూ శేషగిరమ్మ ఒంటరి జీవనం సాగిస్తోంది. ప్రభుత్వ దుర్నీతిపై కోర్టుకు వెళ్లిన వృద్ధురాలు తన భూమి తిరిగి ఇప్పించాలని.. లేదంటే కారుణ్య మరణానికి అనుమతించాలని వేడుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలోనే న్యాయ పోరాటం చేసరీ?తనే తనకు సాయం చేయాలని వైఎస్ జగన్‌ను కలుసుకుని గోడు వెళ్లబోసుకుంది. గతేడాది అక్టోబర్‌లో తన స్థలంలోని ఉంటున్న ఇల్లు అగ్నికి ఆహుతి కాగా.. ఫైర్ అధికారులు సర్టిఫికెట్ కూడా ఇవ్వట్లేదని వాపోయింది. స్వశక్తి, ఆత్మాభిమానంతో జీవించే శేషగిరమ్మ ఈ వయసులోనూ ఎవరి ఆర్థిక సహాయాలను కోరుకోవట్లేదు. కొంతమంది దాతలు, ఎన్నారైలు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చినా వద్దని.. తన భూమి తిరిగి వస్తే చాలని తిరస్కరించింది. ఇంతటి విలువలు కలిగిన వృద్ధురాలి నుంచి ప్రభుత్వం భూమి లాక్కోవడం సిగ్గుచేటని, వైఎస్సార్‌సీపీ తరఫున పూర్తిగా అండగా నిలుస్తామని మాజీ సీఎం వైఎస్ జగన్ ఆమెకు భరోసా కల్పించారు.




రాష్ట్ర రాజధానికి పార్లమెంటు చట్టబద్ధత కల్పించడాన్ని ప్రజా విజయంగా ఆయన అభివర్ణించారు. అమరావతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ధన్యవాదాలు తెలిపారు. అన్ని పార్టీలు అమరావతికి సహకరించి, దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజుగా మార్చాయని ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

**వైసీపీది నీతిమాలిన రాజకీయం**

"పార్లమెంటులో అమరావతికి తిరుగులేని శాసనం చేసుకున్నాం. పార్లమెంటులో అమరావతి బిల్లు పెడితే దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతికి అండగా నిలబడినా.. ఒకే ఒక్క దిక్కుమాలిన పార్టీ వైసీపీ మాత్రం వ్యతిరేకించింది. ఇంతటి నీతిమాలిన రాజకీయం నా చరిత్రలో చూడలేదు. ఆ పార్టీ నేతలు అమరావతిని శ్మశానం అన్నారు. రాజధానితో మూడు ముక్కలాట ఆడారు. అడ్రస్ లేకుండా పోయారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడాన్ని ఓర్వలేని జగన్.. మావిగన్ అంటూ ఓ కొత్త ప్రతిపాదనతో డ్రామాకు తెరలేపారు. తెలుగుజాతి ఆత్మగౌరవం వీరికి పట్టదు. ప్రజలు, రాష్ట్ర భవిష్యత్తు గురించీ పట్టదు. విధ్వంసాలు చేయడం.. విషం చిమ్మడం, ప్రజలను భయభ్రాంతులను చేయడం. అమరావతిని చంపాలనుకున్న ఆ పార్టీకి భవిష్యత్తు లేకుండా చేయాలి. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తుంటే చట్టసభ నుంచి ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ప్రజలు ఆ పార్టీని బ్లాక్ ఔట్ చేయాలి' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

**అమరావతి.. ఆంధ్రుల ఆత్మగౌరవ చిహ్నం**

"అమరావతి రైతులు, రైతు కూలీలు, ప్రజల ఐకమత్యం వల్లే ఈ విజయం సాధించుకున్నాం. అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిహ్నం అని చాటారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి చీకటి రోజులు దాపురించాయి. ప్రజావేదికతో విధ్వంసాన్ని ప్రారంభించి, అమరావతిని ధ్వంసం చేశారు. దానిని అడ్డుకుంటూ రాజధాని రైతులు, మహిళల వీరత్వం, పోరాటాన్ని ప్రత్యక్షంగా చూశాను. ఉద్యమ శిబిరాలకు నాడు సతీసమేతంగా వచ్చాను. రైతుల ఉద్యమం చూసి భువనేశ్వరి చలించిపోయారు. ఉద్యమానికి సంఘీభావం తెలిపి చేతికున్న రెండు బంగారు గాజులు ఇచ్చారు. భువనేశ్వరి ఒక్కరే కాదు.. రాష్ట్ర ప్రజలు, దేశవిదేశాల్లో ఉన్న చాలా మంది ఉద్యమానికి అండగా నిలిచారు. న్యాయపోరాటం చేసే స్తోమత కూడా రైతులకు లేదు. ఆనాడు నా దగ్గర డబ్బుల్లేవు. దీంతో అమరావతి ఉద్యమం కోసం నేను స్వయంగా జోలె పట్టాను. మీ ఉద్యమంలో పాల్గొనేందుకు ముళ్ల కంచెలు దాటుకుని పవన్ కల్యాణ్ వచ్చారు. 1631 రోజులు ఉద్యమం ఓ చరిత్ర.. రైతులు చేపట్టిన 'న్యాయస్థానం టు దేవస్థానం' కార్యక్రమాన్ని నాటి పాలకులు అడ్డుకున్నారు. మీ ఉద్యమంపై నాటి ప్రభుత్వ దాష్టీకాన్ని చూసి నేనే మిమ్మల్ని యాత్ర ఆపేయమని కోరాను. మూడు ముక్కలాట చూసిన రాష్ట్ర ప్రజలు.. 2024లో కూటమికి అద్భుత విజయం అందించారు. ఇప్పుడు రాజధానికి చట్టబద్ధత కలిగింది. అమరావతి.. తెలుగు జాతి గుండె, జాతి గౌరవం. ప్రపంచంలోనే అమరావతిని ఉత్తమ నగరంగా తీర్చిదిద్ది జాతికి అంకితం చేస్తాను" అని సీఎం తెలిపారు.

**ప్రపంచం చూసేలా అభివృద్ధి చేస్తాం**

"ఓ ప్రాజెక్టుకు ప్రధాని రెండుసార్లు రావడం అమరావతి పనుల విషయంలోనే జరిగింది. అమరావతి నిర్మాణాలు పూర్తయ్యాక మూడోసారి ప్రధాని అమరావతి వస్తారు. ప్రారంభోత్సవాలు చేస్తారు. అమరావతి శంకుస్థాపన రోజున.. పార్లమెంటు వద్ద ఉన్న పవిత్రమైన మట్టిని, పవిత్ర యమునా నది జలాలను ఇక్కడికి తీసుకొచ్చారు. అలాంటి వాటితో పునీతమైన పవిత్ర భూమి ఇది. దేశమంతా అమరావతికి అండగా ఉంటుందని చెప్పడానికే నాడు ప్రధాని వాటిని తీసుకొచ్చారు. అమరావతి అన్‌స్టాపబుల్.. అద్వితీయం.. అజేయం.. అజరామరం. 1995 నుంచి 2004 వరకు హైదరాబాద్ అభివృద్ధి ఏమిటో ఇప్పుడు ప్రపంచం చూస్తోంది. భవిష్యత్తులో అమరావతి అభివృద్ధిని కూడా ప్రపంచం చూసేలా చేస్తాం" అని పేర్కొన్నారు.

**ఈ విజయం వెనుక ఎన్నో కన్నీళ్లు: మాధవ్**

విజయోత్సవ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ.. "అమరావతికి చట్టబద్ధత వెనుక ఎందరో రైతులు, ప్రజల కష్టాలు, కన్నీళ్లు ఉన్నాయి. అరెస్టులు ఎదుర్కొని, ఎన్నో త్యాగాలు చేసి అమరావతిని నిలబెట్టుకున్నారు." అని పేర్కొన్నారు.

**ఇక రాజధాని అభివృద్ధి రయ్‌రయ్: నాదెండ్ల**

పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. అమరావతి అభివృద్ధి కోసం ప్రజలంతా ఆశగా ఎదురుచూస్తున్నారని అన్నారు. అమరావతికి చట్టబద్ధతతో ఇక రాజధాని అభివృద్ధి పనులు మరోస్థాయికి వెళ్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# మాతో ఒప్పందానికి రావాల్సిందే

"వారు కొంత ఆలస్యమైనా ధైర్యం తెచ్చుకొని, దానిని స్వాధీనం చేసుకోవాలి. ఇరాన్ నాశనమైంది. కష్టమైన పని పూర్తయింది కాబట్టి.. స్వాధీనం చేసుకునే పని సులభంగా ఉండాలి" అని ఆయన అన్నారు. గురువారం దేశ ప్రజలను ఉద్దేశించి శ్వేతసౌధం నుంచి ట్రంప్ ఈ ప్రసంగం చేశారు. పద్దెనిమిది నిమిషాల పాటు ఆయన ప్రసంగం సాగింది. ఈ ప్రసంగంలో ఇరాన్‌తో యుద్ధం గురించి పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

ఇరాన్ తమతో ఒప్పందానికి రావాలనీ, లేకపోతే రెండు మూడు వారాల్లో ఇరాన్‌ను రాతియుగానికి పంపేంత తీవ్రంగా అమెరికా దెబ్బతీస్తుందని ట్రంప్ హెచ్చరించారు. అత్యంత శక్తివంతమైన దేశాలలో ఒక దానిని నాశనం చేయడానికి అమెరికాకు 32 రోజులు పట్టిందని ఆయన చెప్పారు. "మా లక్ష్యాలు పూర్తిగా నెరవేరే వరకు దాడులను మేము కొనసాగిస్తాం. త్వరలో, అతి త్వరలో అమెరికా లక్ష్యాలన్నింటినీ పూర్తి చేసే దారిలో ఉందని నేను చెప్పగలను" అని ట్రంప్ అన్నారు. యుద్ధంలో ఇరాన్ భారీగా నష్టపోయిందని చెప్పారు. ఆ దేశంలో కీలక నాయకత్వాన్ని తొలగించామని అన్నారు. యుద్ధం లో మరణించిన 13 మంది అమెరికా సైనికుల కుటుంబాలు 'పనిని పూర్తి చేయాలని' తనను వేడుకున్నాయని కూడా ఆయన తెలిపారు. అమెరికా ప్రారంభించిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' నాలుగు వారాలలో తమ సాయుధ దళాలు యుద్ధరంగంలో వేగవంతమైన, నిర్ణయాత్మకమైన, అఖండమైన విజయాలు సాధించాయని చెప్పుకొచ్చారు. ఈ రాత్రికి ఇరాన్ నౌకాదళం అంతమైందనీ, వారి వైమానిక దళం నాశనమైందని తెలిపారు. వారిలో చాలా మంది ఉగ్రవాదులు, వారు నడిపిన ప్రభుత్వం ఇప్పుడు అంతమ య్యాయని ఆయన అన్నారు. ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలను ధ్వంసం చేయడానికి తాను 'ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్'కు ఆదేశించినట్టు ట్రంప్ చెప్పారు. ఇరాన్ రక్షణ సామర్థ్యాలను ఒక క్రమ పద్ధతిలో నాశనం చేస్తున్నామనీ, వారి నౌకాదళం అంతమైపోయిందని ట్రంప్ తెలిపారు. అనేక ఏండ్లు గా అమెరికా నాశనాన్ని కోరుకున్న ఇరాన్ లెక్కలేనన్ని దారుణ చర్యలకు పాల్పడిందనీ, ఆ హంతకపాలన తన సొంత ప్రజలలో 45వేల మందిని చంపిందని అన్నారు. ఈ పరిస్థితి 45 ఏండ్లుగా కొనసాగిందనీ, దీనిని తన పూర్వ అధ్యక్షుడు ఆపి ఉండాల్సిందని ఆయన తెలిపారు. వారి గౌరవ వందనం పొందడానికి ఒబామా ఇరాన్‌కు అణుబాంబు అభివృద్ధి కోసం 1.5 బిలియన్ డాలర్ల నగదు ఇచ్చారని ఆరోపించారు. "మనం చమురు ఉత్పత్తి కోసం వెనిజులాతో కలిసి పని చేస్తున్నాం. మధ్యప్రాచ్యం నుంచి పూర్తిగా స్వతంత్రంగా ఉన్నాం. మాకు వారి చమురు అవసరం లేదు. స్వల్పకాలిక చమురు ధరల పెరుగుదల ఇరాన్ దిగ్బంధనం ఫలితమేనని, దానికి యుద్ధంతో ఎలాంటి సంబంధమూ లేదని ట్రంప్ తెలిపారు.

# ఇరాన్‌లోని ఐకానిక్ బ్రిడ్జి ధ్వంసం..!

**- అమెరికా, ఇజ్రాయెల్ భీకరదాడి**

వాషింగ్టన్ : పశ్చిమాసియాలో నిర్మాణంలో ఉన్న అతి ఎత్తయిన వంతెనను యూఎస్–ఇజ్రాయెల్ వైమానిక దళాలు దాడి చేసి కూల్చివేశాయి. ఇలాంటి దాడులు మరిన్ని తప్పవని హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంటల్లో ఉన్న కూలిన బ్రిడ్జి వీడియోను ట్రూత్ సోషల్‌లో ఉంచారు. ఆలస్యం కాకముందే తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ దాడిలో ఇద్దరు పౌరులు గాయపడ్డారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్ పశ్చిమం నుంచి కారజ్ నగరాన్ని కలిపే ఈ బ్రిడ్జి ఎత్తు 136 మీటర్లు. పశ్చిమాసియాలో ఇంజినీరింగ్ అద్భుతంగా దీన్ని పేర్కొనేవారు. జోర్డాన్‌లోని అల్ అజ్రాక్ స్థావరంలోని అమెరికా ఫైటర్ జెట్లపై తాము డ్రోన్ దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. జోర్డాన్ బేస్‌లో అమెరికా విమానాలు నిలిపి ఉంచగా ఈ దాడి జరిగింది. అయితే విమానాలకు ఎంత నష్టం వాటిల్లినదీ వివరాలు తెలియరాలేదు. గల్ఫ్‌లో పౌర మౌలిక సదుపాయాలు లక్ష్యంగా తమ దాడులు కొనసాగినట్టు పేర్కొన్నది. తమ దాడులను మరింత విస్తరిస్తామని, అందులో భాగంగా, కువైట్, సౌదీ అరేబియా, అబుదాబి, జోర్డాన్‌లో పలు బ్రిడ్జిలు లక్ష్యంగా తమ మిలిటరీ దాడులు చేసే అవకాశం ఉందని తెలిపింది. హెర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు 35 దేశాల ప్రతినిధులతో జరిగే బహుపాక్షిక చర్చల్లో పాల్గొనాలని యూకే నుంచి భారత్‌కు ఆహ్వానం అందినట్టు విదేశాంగ శాఖ గురువారం వెల్లడించింది. గురువారం సాయంత్రం ప్రారంభమైన ఈ సమావేశానికి భారత్ నుంచి విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ హాజరయ్యారని ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ తెలిపారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు, హెర్ముజ్ ప్రతిష్ఠంభన, దానిని తెరిపించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి సమావేశంలో చర్చిస్తారని తెలిపారు.

# నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.. నా రాజధాని అమరావతి

- అమరావతి రైతులకు, ప్రజలకు నా సెల్యూట్
- నా రాజధాని అమరావతి అని గర్వపడేలా చేశారు
- దేవుడు సీఎం వెంటే ఉన్నారు అనే దానికి ఇదే నిదర్శనం
- ప్రతి ఒక్కరూ సాయంత్రం రెండు దీపాలు వెలిగించండి
- ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు కి ప్రత్యేక ధన్యవాదాలు
- అమరావతికి మద్దతుగా భారీ ర్యాలీ..!
- తరలివచ్చిన ప్రజానీకం




**విజ్ఞాన్ దినపత్రిక కోవూరు రిపోర్టర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల చిరకాల స్వప్నం అమరావతి రాజధాని బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం లభించడం ప్రతి ఒక్కరికీ గర్వ కారణమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్, నా రాజధాని అమరావతి అనేలా ప్రతి ఒక్కరూ ఉప్పొంగిపోయే విషయమన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మినగల్లులో బుచ్చిరెడ్డిపాలెం మండలం, మినగల్లు పంచాయతీ నందు, నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయం, సీసీ రోడ్ల ప్రారంభోత్సవం, పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ప్రజలు, స్థానిక నాయకులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం అభివృద్ధి, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతిని సాకారం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, సీఎం చంద్రబాబు కి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. 2014-19 మధ్య రాజధాని పనులు చేపడితే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని పక్కన పడేసిందన్నారు. నాడు ప్రధాని మోడీని రాష్ట్రానికి తెచ్చి శంకుస్థాపన చేశారన్నారు. నేడు అదే రాజధానికి చట్టబద్ధత కల్పించి రాష్ట్ర ప్రజలను గర్వపడేలా చేశారన్నారు. దేశం మొత్తం అమరావతికి మద్దతుగా ఉంటే ఒక్క వైసీపీ మాత్రం వ్యతిరేకించి తమ బుద్ధి చూపిందని ఎద్దేవా చేశారు. ఇలాంటి నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని కూటమి ప్రభుత్వం నిరూపించిందని చెప్పారు. ఈ సందర్భంగా రైతుల కష్టాలను, వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఈ రోజు సాయంత్రం రెండు దీపాలు వెలిగించి తమ సంఘీభావం తెలపాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 21 నెలల కాలంలో చేతల ప్రభుత్వం అని అభివృద్ధి చేసి నిరూపించుకున్నామన్నారు. ఎన్నికల చేసిన హామీలన్నీ అమలు చేస్తూ సంక్షేమ పథకాలను గడపకే చేర్చామన్నారు. ?కొత్త మినగల్లులో 15 లక్షల 60 వేలతో 3 సిసి రోడ్లు, ?పాత మినగల్లులో 10 లక్షలతో నిర్మించిన స్మశానవాటికకు వెళ్లే సిసి రోడ్డు ప్రారంభోత్సవాలు, 40 లక్షలతో వాటర్ పైప్‌లైన్ శంకుస్థాపన మొత్తం 65 లక్షల 60 వేలతో చేసుకుంటున్న అభివృద్ధి పనులే కూటమి ప్రభుత్వ పనితీరుకు అద్దం పడుతున్నాయని చెప్పారు. 52 లక్షలతో కాలువల్లో పూడిక తీత చేపట్టామన్నారు. మినగల్లు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న పాత పంచాయతీ కార్యాలయాన్ని గ్రామస్తుల అభ్యర్థన మేరకు 90 వేల రూపాయలు వెచ్చించి గ్రంథాలయంగా మార్చడం జరిగిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు పరిపాలన దక్షత, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పట్టుదల రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పించాలన్న యువనేత, ఐటీ మరియు విద్యా శాఖ మంత్రి లోకేష్ కృషి చూస్తుంటే ఇలాంటి నాయకులు దొరకడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. రాబోయే రోజుల్లో మరిన్నికార్యక్రమాలు చేపడతామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

# విజేత

బంధాలు బంధుత్వాల మధ్య
మనస్పర్థలు వచ్చినప్పుడు
మీరే కాస్త దూరంగా ఉండండి
అంతే కానీ... అనవసరంగా
మాట మాట పెంచుకోకండి
మళ్ళీ మీరు కలిసిపోయినప్పుడు
మనుషులు కలిసినంత
సులువుగా తొందరగా
మనుషులు కలవలేవు
బంధాలు కలుపుకోవాలి
బంధుత్వాలు నిలుపుకోవాలి.

ఓటమిని కూడా స్వీకరించాలి
ఒక పూట పస్తులున్నా సరే
తల ఎత్తుకొని బ్రతకడం నేర్చుకో!
గౌరవంతో కొద్ది రోజులు
బ్రతికినా చాలు కదా!
అంతే కానీ... విలువలేని
బ్రతుకు వందసంవత్సరాలు
బ్రతికినా ఏం లాభం?
నిజమైన విజేతలెప్పుడూ
ఎదుటివాళ్ళను నమ్ముకోరు
తమ యొక్క స్వయం శక్తితో
తమను తామే నమ్ముకుంటారు
అసలు పోటీ లేని గెలుపు
కష్ట పడకుండా వచ్చే ధనం
నమ్మకం లేని బంధం
ఎక్కువ కాలం నిలబడవు.



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి.. అమరావతితో సాధ్యం

- రాజధానికి భూములిచ్చిన ప్రతి రైతుకు ఇది గర్వకారణం
- నిరుపేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- 67 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి
- ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు శ్రీ రామ లక్ష
- కోవూరులో జరిగే అభివృద్ధి కళ్లకు కనిపించడం లేదా
- ఆరుసార్లు ఎమ్మెల్యే.. చేసిందేంటి.. విచారణ చేస్తే అన్నీ బయటకు వస్తాయి
- నియోజకవర్గంలో ఎలాంటి అవకతవకలు జరగట్లేదు
- ఇప్పటికే అధికారులకు కూడా తగిన ఆదేశాలు ఇచ్చాం



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అభివృద్ధి.. అమరావతి రాజధానితో సాధ్యమని, అందుకే చట్టబద్ధంగా రాజధాని ఏర్పాటు కాబోతోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. రాజధాని ఏర్పాటులో భాగం అయిన ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు. రాజధానికి చట్టబద్ధత కల్పించడంలో కీలక పాత్ర వహించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గురువారం విపిఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని అర్హులకు చెక్కులు అందజేశారు. రైతులు తమ పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని రాజధాని కోసం అందించినట్లు వివరించారు. వారి సేవలను గుర్తు చేసుకోవడం మన బాధ్యత అని అన్నారు. సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా రాష్ట్రాన్ని తీసుకువెళుతున్నారని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల ఆరోగ్యాలకు పెద్దపీట వేస్తున్నారని స్పష్టం చేశారు. నెల్లూరు పార్లమెంట్, కోవూరు నియోజకవర్గ పరిధిలో 67 మందికి దాదాపు రూ.66 లక్షలు అందజేశారు.

**తప్పుడు ఆరోపణలు రాస్తే.. తీవ్ర చర్యలు తీసుకుంటాం..!**

సాక్షి ఛానల్‌లో వచ్చిన అవాస్తవాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని, తనకు ఆక్రమణలు చేసే అవసరం లేదన్నారు. నియోజకవర్గంలో ఏ తప్పు జరిగినా కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే కలెక్టర్ కి వివరించామన్నారు. తనపై పిచ్చి ఛానల్‌లో పిచ్చి వార్తలు రాస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఆరు సార్లు ఎమ్మెల్యే అని చెప్పుకొంటున్న ప్రసన్న కుమార్‌రెడ్డి ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసన్నారు. కనిగిరి రిజర్వాయర్‌కు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని అన్నారు. చెత్త మాటలు మాట్లాడుతూ తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎక్కడైనా తప్పు జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ అధికారులకు ఇప్పటికే తగిన ఆదేశాలు ఇచ్చామన్నారు. రేగడి చెలికలో గత ప్రభుత్వంలో ఎత్తిన గ్రావెల్ లెక్కలు ఎన్నో ఉన్నాయన్నారు. మీడియా ప్రతినిధులు నిజానిజాలు తెలుసుకుని వాస్తవాలు వెల్లడించాలన్నారు. ఎమ్మెల్యే అంటే ఏంటో తాను చేసి చూపిస్తున్నానని చెప్పారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో వదిలేసిన అనేక పనులను నేడు తాము చేస్తున్నామని స్పష్టం చేశారు. ఉప్పుటేరుకు 10 కోట్లు శాంక్షన్ చేశారని అన్నారు. కనిగిరి రిజర్వాయర్ మరమ్మతులకు 48 కోట్లు కేటాయించారని, ప్రస్తుత రిపేర్లకు 5 కోట్లు అందించారన్నారు. తమకు ప్రజలకు సేవ చేయడమే లక్షమని, నాయకులు కూడా సమన్వయంతో పనిచేస్తున్నారని అన్నారు.

# రోడ్డు భద్రత కోసం రాంబిల్లిలో 20 సౌర వీధి దీపాల ఏర్పాటు




**విజ్ఞాన పత్రిక రాంబిల్లి రిపోర్టర్ కోట్ని బాబురావు రాంబిల్లి, అనకాపల్లి జిల్లా:** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన సిన్హా ఆదేశాల మేరకు రోడ్డు భద్రతను మెరుగుపరచడం మరియు రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు రాంబిల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కీలక చర్యలు చేపట్టబడ్డాయి. పోలీసుల అభ్యర్థనపై సుమిండియా సంస్థ సహకారంతో వెంకటాపురం జంక్షన్ నుండి చీపూరాదీ వరకు చీకటి ప్రాంతాల్లో వెలుతురు మెరుగుపరచడానికి మొత్తం 20 సౌర వీధి దీపాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమంలో సుమిండియా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు చురుకుగా పాల్గొన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ థియోడర్ పాల్, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ సంజయ్ మిత్రా, అడ్మినిస్ట్రేషన్ విభాగం నుండి శ్రీ సుబ్రమణ్యం ఎం మరియు శ్రీ వై. ప్రసన్న కుమార్ గారు ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ముఖ్య పాత్ర పోషించారు

# రాజధాని గా అమరావతి.

-డాక్టర్ కే. నారాయణ సిపిఐ జాతీయ కార్యదర్శి..!



**నెల్లూరు సిటీ... ఏప్రియల్./2(విజ్ఞాన్‌ప్రతినిధి).:** అమరావతిని రాజధానిగా లోక్ భలో ఆమోదించారు. రాజ్యసభలో ఆమోదించబోతున్నారు. అమరావతి రాజధాని అనేది ప్రజల ఆకాంక్ష. 1952లో మద్రాసు నుండి విడిపడిన నాటి నుండి కూడా విజయవాడ రాజధానిగా ఉండాలని కమ్యూనిస్టు పార్టీ చెప్పిందని . భారతదేశంలో, ఆంధ్రప్రదేశ్లో విజయవాడ రాజధానిగా కావాలని మొట్టమొదట కోరింది సిపిఐ నే. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే. నారాయణ పేర్కొన్నారు గురువారం ఆయన నెల్లూరు పార్టీ కార్యాలయం లో మీడియా తో మాట్లాడుతూ వైసిపిపార్టీ నుండి విచిత్ర వైఖరి కనిపిస్తుందని . ఒక తప్పును కప్పిపుచ్చాలంటే 100 తప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంటుందనట్లుగా ఏపీ రాజధానిని మూడు ముక్కలాటగా మార్చి, అమరావతిని నిర్వీర్యం చేయాలని వైసిపి ప్రయత్నించిందని దాని ఫలితంగా 11 స్థానాలతో సరిపెట్టుకొని ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందన్నారు ఇప్పుడు అమరావతి బిల్లు ప్రవేశపెట్టే సందర్భంలో వైసీపీ సభ్యులు పార్లమెంటును కూడా బాయ్ కాట్ చేశారు. ఏపీ అసెంబ్లీలో బిల్లు ఆమోదించే సమయంలో కూడా హాజరు కాలేదు. ఇప్పటికైనా వైసీపీకి జ్ఞానోదయం కలగకపోతే నష్టం తప్పదువిమర్శలు చేశారు.. యువకుడు, రాజకీయ భవిష్యత్తు ఉన్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి ఎందుకు ఇలా చేస్తున్నాడో అర్థం కావడం లేదన్నారు. టిడిపి వాళ్లు ఏపీకి ప్రత్యేక హోదా సాధిస్తాం అని హామీ ఇచ్చారు. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు రప్పిస్తామని చెప్పారు. అమరావతి రాజధాని బిల్లుతోపాటు ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీలు అమలు చేయాలని కేంద్రానికి చెప్పి ఉంటే బాగుండేదన్నారు... రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ విషయంలో తప్పు చేశారని అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పర ఆరోపణలు, దూషణలు చేసుకుంటూ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఇది సరైనవిధానం కాదని . రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఏపీకి ప్రత్యేక హోదాని కోరాల్సిందేనన్ని డిమాండ్ చేశారు..

# ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని పార్లమెంట్ ఆమోదించడంపై ఆత్మకూరు జనసేన పార్టీ హర్షం

-నలిశెట్టి శ్రీధర్ జనసేన పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ ఇంచార్జి



**ఏసిపోగు బాబు విజ్ఞాన దిన పత్రిక రిపోర్టర్ ఆత్మకూరు** ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని రాజధాని లేని రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ కు అమరావతి రాజధానిగా ప్రకటిస్తూ పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం వ్యక్తం చేయడంపై జనసేన పార్టీ ఆత్మకూరు నియోజకవర్గం ఇన్చార్జ్ నలిశెట్టి.శ్రీధర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తపరుస్తూ నినాదాలు చేశారు.... ఆత్మకూరులోని వారి పార్టీ కార్యాలయంలో నేడు నిర్వహించిన సభలో నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీధర్ మాట్లాడుతూ తమ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పిన మాట ప్రకారము ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఆమోదిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయాన్ని భారత ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ ఉభయ సభలో ఆమోదింప చేయడం చాలా సంతోషకరమని అన్నారు.. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించేందుకు ప్రతిపక్ష నేత జగన్మోహన్రెడ్డి పన్నిన ఎన్నో కుయుక్తులను అధిగమించి అమరావతిని రాజధానిగా సాధించడం ఇది రాష్ట్ర ప్రజల విజయంగా తెలిపారు.. ఈ కార్యక్రమంలో వీరితోపాటు జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు పేమల.సురేంద్ర, పార్టీ నేతలు గడ్డం వంశీ, పాటి. రాఘవ, నాగరాజు యాదవ్, మదన్ యాదవ్, మావిళ్ళ.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతే మా రాజధాని

- దీపాలు వెలిగించి హర్షం వ్యక్తం చేసిన విపిఆర్ దంపతులు
- జై అమరావతి అంటూ నినాదాలు



అమరావతి బిల్లుకు పార్లమెంట్‌లో ఆమోదం లభించడంపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం దీపాలు వెలిగించి తమ మద్దతు తెలిపి హర్షాతిరేకాలు తెలియజేశారు. ఇది ప్రజా రాజధాని అని .. నా రాజధాని అమరావతి అంటూ గర్వంగా చాటాలన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం సాధించిన విజయమన్నారు. జై అమరావతి నినాదాలతో హోరెత్తించారు.

# ఆంధ్రప్రదేశ్ రాజధాని గా అమరావతికి కేంద్రం ఆమోదం



**బాబు ఏసిపోగు విజ్ఞాన దిన పత్రిక రిపోర్టర్ ఆత్మకూరు.** గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు గౌరవనీయులైన శ్రీ ఆనం రామ నారాయణరెడ్డిగారి సూచనల మేరకు రాష్ట్ర కార్యదర్శి మరియు సర్వేపల్లి పరిశీలకులు దావా పెంచల రావు గారి ఆధ్వర్యంలో వారి స్వగృహం నందు రాజధానిగా అమరావతి ఆమోదం పొందిన సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు వారి స్వగృహం నందు క్యాండిల రూపంలో ఆనందాన్ని వ్యక్తం చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు బూత్ కన్వీనర్ వంటేరు మల్లికార్జున యాదవ్ మరియు పి. పెంచలయ్య గారు, మోడీ శ్రీరాములు గారూ, రమణయ్య గారుపాల్గొన్నారు,

## కార్సినోజెనెసిస్ మరియు క్యాన్సర్ రిస్క్ ఫ్యాక్టర్స్ ,క్యాన్సర్ అభివృద్ధికి దారితీసే ముఖ్యమైన అంశం రిస్క్ ఫ్యాక్టర్స్ డాక్టర్ శ్రావణ్ కుమార్.

**విజ్ఞాన్ దినపత్రిక టౌన్ రిపోర్టర్ :** కార్సినోజెనెసిస్ అనేది సాధారణ కణాలు క్రమంగా జన్యు మరియు అణు స్థాయి మార్పులకు లోనై క్యాన్సర్ కణాలుగా మారే సంక్లిష్టమైన జీవ వైజ్ఞానిక ప్రక్రియ. ఈ ప్రక్రియ ఒక్కసారిగా జరగకుండా, అనేక దశలలో అభివృద్ధి చెందుతుంది. ప్రారంభ దశలో శ్రీ లిటిషన్ ధన (×అఠఉఖ్ఉశీఅ) ఐచీూ లో శాశ్వతమైన మార్పులు సంభవిస్తాయి. తదుపరి దశలో (ప్రమోషన్) ఈ మార్పులు కలిగిన కణాలు నియంత్రణ లేకుండా విస్తరిస్తాయి. చివరి దశలో ప్రోగ్రెసివ్ (గ్రాతీశీస్త్రతీవంంఅశీఅ) ఈ కణాలు మరింత ఆగ్రెసివ్ స్వభావాన్ని పొందుతూ చుట్టుపక్కల కణజాలాలను ఆక్రమించి, శరీరంలోని ఇతర భాగాలకు వ్యాప్తి చెందే సామర్థ్యాన్ని పొందుతాయి అని మెడికల్ హాస్పిటల్ రాఅషశీశ్రీశీస్త్రఱర్ డాక్టర్ శ్రావణ్ కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు హాస్పిటల్లో మాట్లాడుతూ క్యాన్సర్ అభివృద్ధికి దారితీసే ముఖ్యమైన అంశాలను రిస్క్ ఫ్యాక్టర్స్ అంటారు. జీవనశైలి సంబంధిత అలవాట్లు ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా ధూమపానం, పొగాకు పదార్థాల వినియోగం మరియు మద్యపానం అనేవి ఊపిరితిత్తులు, నోరు, గొంతు మరియు కాలేయ క్యాన్సర్లకు ప్రధాన కారణాలుగా గుర్తించబడ్డాయి అని వారు తెలిపారు. అదేవిధంగా, అధిక కొవ్వు మరియు ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవడం, తక్కువ ఫైబర్ ఉన్న ఆహారపు అలవాట్లు కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి వారన్నారు. పర్యావరణ కారణాలు కూడా కార్సినోజెనెసిస్‌లో కీలక పాత్ర పోషిస్తాయి. గాలి కాలుష్యం, పారిశ్రామిక రసాయనాలు మరియు అల్ట్రావయలెట్ కిరణాల వంటి అంశాలు ధన నష్టం కలిగించి కణాల అసాధారణ వృద్ధికి



దారి తీస్తాయి. అదనంగా, కొన్ని వైరల్ మరియు బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు కూడా క్యాన్సర్‌కు కారణమవుతాయి. ఉదాహరణకు, హ్యూమన్ పాపిలోమా వైరస్ (న్రూఎ) సర్వికల్ క్యాన్సర్‌కు, హెపటైటిస్ దీ మరియు జ వైరస్‌లు లివర్ క్యాన్సర్‌కు సంబంధించబడ్డాయి. వంశపారంపర్య అంశాలు కూడా నిర్లక్ష్యం చేయరాని ముఖ్యమైన రిస్క్ ఫ్యాక్టర్. కుటుంబంలో క్యాన్సర్ చరిత్ర ఉన్న వ్యక్తుల్లో కొన్ని రకాల క్యాన్సర్లు అభివృద్ధి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అంతేకాకుండా, స్థూలకాయం (గాఎవంఠఎ) మరియు శారీరక చురుకుదనం లేకపోవడం కూడా బ్రెస్ట్, కొలొరెక్టల్ మరియు ఇతర క్యాన్సర్ల ప్రమాదాన్ని పెంచుతాయి అని వారన్నారు. క్యాన్సర్ నివారణలో అవగాహన మరియు ముందస్తు జాగ్రత్తలు అత్యంత ముఖ్యమైనవి. ధూమపానం మానడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, నియమిత వ్యాయామం చేయడం మరియు అవసరమైన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అలాగే, హెచ్‌పివి మరియు హెపటైటిస్ దీ వంటి టీకాలు కొన్ని రకాల క్యాన్సర్లను నివారించడంలో సహాయపడతాయి అని వారు తెలియజేశారు. మొత్తంగా, కార్సినోజెనెసిస్ అనేది దీర్ఘకాలిక మరియు బహుళ కారకాలపై ఆధారపడిన ప్రక్రియ. అయితే, సరైన అవగాహన మరియు జీవనశైలి మార్పులతో క్యాన్సర్‌ను నివారించడం సాధ్యమే అని వారు తెలిపారు.

## ఆత్మకూరు మండలం కరటంపాడు గ్రామములో టీడీపీ గ్రామ కార్యదర్శి కోసూరు చెన్నయ్య ఆధ్వర్యంలో సంబరాలు




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ దేవధాయ ధర్మధాయ శాఖమాత్యులు అనం రామనారాయణ రెడ్డి సూచనలు తో ఆత్మకూరు మండలం కరటంపాడు గ్రామంలో టిడిపిగ్రామ కార్యదర్శి కోసూరు చెన్నయ్య ఆధ్వర్యంలో అమరావతిని శాశ్విత రాజధానిగా కేంద్రం ప్రకటించినందుకు గ్రామములో సంబరాలు మిన్నంటాయి.. దీపాలంకరణ మరియు టపాసులుపేల్చి స్వీట్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమం లో ఆత్మకూరు మండల టీడీపీ పార్టీ కోశాధికారి మహమ్మద్ హనీఫ్, మైనారిటీ నాయుకులు పఠాన్ సుభహన్, మండల మైనారిటీ నాయుకులు నజీర్ ఖాన్ మాజీ వార్డ్ మెంబెర్ ,ఉప్పులూరు రామచంద్ర నాయుడు, సుబ్బారెడ్డి నాయుకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## కోదండ రామస్వామి వారి రథోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో శ్రీ కోదండ రామస్వామి వారి శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా స్వామివారి రథోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ పవిత్ర వేడుకలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై శ్రీరామ్ నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ, శ్రీ కోదండ రామస్వామి వారి ఆశీస్సులతో కోవూరు ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు. భక్తులతో కలిసి రథాన్ని లాగుతూ ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని పంచుకున్నారు. రథోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారికి దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిందని ఆమె తెలిపారు.

## ప్రపంచ ఆటిజం దినోత్సవ అవగాహన సదస్సు

ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని డా॥ కిషోర్స్ రత్నం స్కూల్స్, సరస్వతినగర్ విద్యార్థులు నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్ నందు చక్కగా ర్యాలీని నిర్వహించారు. వైవిధ్యాన్ని అంగీకరించండి-" ప్రతి మనసు ప్రత్యేకమే" అనే సందేశంతో విద్యార్థులు చక్కటి ప్లకార్డులతో ఆటిజం గురించి సమాజంలో అవగాహన పెంచాలని, ఆటిజం ఉన్న పిల్లలను సహనంతో అర్థంచేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్ వైద్య సిబ్బంది సూపర్నిండింట్ కె. మాధవి, డా॥ సుభానీ, మరియు శరత్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు చక్కటి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ డా॥ మాధవి మాట్లాడుతూ ప్రతి పిల్లవాడు ప్రత్యేకమైన వాడని ఆటిజం ఉన్న పిల్లలకు ప్రేమ, సహనం మరియు ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు డా॥ కిషోర్స్ రత్నం మెడికల్ ఒలంపియాడ్ 7వ తరగతి విద్యార్థిని వెంకట రిత్విక, ఆటిజం ఉన్న పిల్లల ప్రత్యేకతలు, వారి భావోద్వేగాలను గురించి ఆమె తెలియజేసింది. ఈ కార్యక్రమంలో చివరగా విద్యార్థులు, "వైవిధ్యాన్ని గౌరవిద్దాం ప్రతి మనసు విలువమైనదే" అనే సందేశంతో అవగాహన ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డా॥ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి




నాయుడు, మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప అవగాహనను కలుగజేస్తుందని తెలియజేశారు. విద్యార్థులకు చక్కటి విషయ పరిజ్ఞానం కలిగించిన నెల్లూరు గవర్నమెంట్ హాస్పిటల్ వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా॥ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల ఎ.ఒ తుహీన, జూనియర్ మేనేజర్ అజయ్ సింగ్, ప్రిన్సిపాల్స్ మణిమాల, జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వరికుంటపాడులో అంబరాన్నంటిన అమరావతి సంబరాలు

**-అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై సర్వత్రా హర్షం**

**-జై అమరావతి అంటూ ర్యాలీ నిర్వహించిన ఉదయగిరి నియోజకవర్గ కూటమి నాయకులు**

**-కేక్ కట్ చేసి అమరావతికి జేజేలు పలికిన నాయకులు**

**వరికుంటపాడు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ , ఏప్రిల్ 2** ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండల కేంద్రంలో అమరావతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి శాశ్వత రాజధానికిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ భారత లోక్‌సభ, రాజ్యసభలు ఆమోదముద్ర వేసిన శుభసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ , మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి తో కలసి ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు యువత, మహిళలు, ప్రముఖులు గురువారం తమ ఆనందోత్సాహాలను వ్యక్త పరుస్తూ వరికుంటపాడు మండల కేంద్రంలోని కరెంట్ ఆఫీస్ నుండి సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దేవాలయాలలో ప్రార్థనలు నిర్వహించి, కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. యువత ఆనందంతో రాష్ట్ర చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మకరోజు అని, రాష్ట్ర చరిత్రలో నూతన శకానికి పునాది పడిందని, అభివృద్ధికి అడుగులు



చిరస్థాయిగా పడ్డాయని జై అమరావతి జైజై అమరావతి అంటూ ప్రదర్శనలు, బైక్ ర్యాలీలతో హోరెత్తించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ప్రముఖులు తమ సంతోషాన్ని పంచుకున్నారు. దేవతల రాజధాని మన రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా చరిత్ర గర్వించేవిధంగా ప్రభుత్వాలు చట్టబద్ధత కల్పించడం యావత్ ప్రపంచంలోని తెలుగుప్రజల విజయంగా వర్ణిస్తూ ప్రజలు, మహిళలందరూ అమరావతి ఆనందాన్ని పంచుకున్నారు

## 1కోటి 15 లక్షల రూపాయల అభివృద్ధి పనులను 19 వ డివిజన్ లో ప్రారంభించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్,

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 19వ డివిజన్ ముత్యాలపాలెంలో 1, 2, 12, 17 మరియు 19 డివిజన్లలో 1 కోటి 15 లక్షల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. ఈ సందర్భంగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ కుమార్ మాట్లాడుతూనెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ముత్యాలపాలెం ప్రాంతంలో పలు డివిజన్లలో రూ. 1.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనటం చాలా ఆనందంగా సంతోషంగా ఉందన్నారు. నెల్లూరు రూరల్ లో జరిగే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు జిల్లాలో ఉండే శాసనసభ్యులను పిలిచి ఒక మంచి సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారన్నారు .శ్రీధర్ అన్న ప్రజలతో మమేకమయ్యే తీరు అద్భుతం. నాయకులకు ఉండాల్సిన లక్షణాలు అన్నీ శ్రీధర్ అన్నకు ఉన్నాయి అని వారన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధే నా లక్ష్యం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. నెల్లూరు రూరల్ నియోజకవర్గం అభివృద్ధి బాటలో నడిపించడమే నా ఏకైక లక్షణమని నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. నిత్యం ప్రజల్లోన్నే ఉంటాం. కూటమి ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకొనివెళుతున్నామన్నారు. నెల్లూరు జిల్లా తెలుగుదేశం



నేతలందరం ఒక్కతాటిపై ఉంటామన్నారు. నిన్న జగన్ మోహన్ రెడ్డి మాట్లాడిన మాటలు చూసి పిల్లలు సైతం నవ్వుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న మంచి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేర్చడం మా బాధ్యతగా భావిస్తున్నాం అని ఆయన అన్నారు. నెల్లూరు జిల్లా అభివృద్ధి కోసం అందరం ఒక్కటై కృషి చేస్తూ, ప్రజల విశ్వాసానికి తగ్గట్లుగా మరింత సేవ చేస్తాము అని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, కో క్లస్టర్ ఇంచార్జులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ, జనసేన , బీజేపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి కొండమ్మకు ఘనంగా నివాళులర్పించిన దారపనేని



కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం మోపాడు గ్రామ వాస్తవ్యులు మహంకాళి వెంగయ్య సతీమణి మహంకాళి కొండమ్మ (74) మృతి చెందారు. మహంకాళి కొండమ్మ భౌతికాయాని కి గురువారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ మహంకాళి కొండమ్మ మంచితనానికి మారుపేరు అని, ప్రతి వ్యక్తిని ఆప్యాయంగా పలకరించి గుణవంతురాలు ని, గ్రామంలో అజాతశత్రువు గా పేరు ప్రఖ్యాతులు గడించారని పేర్కొన్నారు. కొండమ్మ కుటుంబ సభ్యులకు దారపనేని ప్రగాఢ సానుభూతి తెలిపారు. మోపాడు రిజర్వాయర్ వైస్ చైర్మన్ మోరుబోయిన నరసింహారావు, మోపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోరుబోయిన గిడ్డయ్య యాదవ్, వచ్చావా పెద పేరయ్య, దేవరపు మాల్యాద్రి, పచ్చావ వెంకటేశ్వర్లు (బాబు) మహంకాళి రాజేంద్ర, మహంకాళి మాల్యాద్రి, మహంకాళి ప్రకాష్ రావు, మద్దినేని ఎరుకలయ్య, మన్నెం దరేంద్ర, కల్లూరి ఖాజా మస్తాన్, బంధుమిత్రులు ,శ్రేయోభిలాషులు మహంకాళి కొండమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

## గ్రామ సభలో పట్టాదారు పాసుపుస్తకాలు తహసీల్దార్ తో కలిసి పంపిణీ చేసిన బైరెడ్డి, దారపనేని



కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని వగ్గంపల్లి గ్రామంలో గురువారం గ్రామసభలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం తహసిల్దార్ రామచంద్రుని వాసుదేవరావు ప్రారంభించారు. ఈ పట్టాదారు పాసు పుస్తకాలను కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డిలు పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్తి అయిన గ్రామాలలో గత ప్రభుత్వంలో జగన్ బొమ్మలతో పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని, దానివలన రైతులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం అయిందని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని అధికారంలోకి రాగానే రాజముద్రతో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలకి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. తహసిల్దార్ రామచంద్రుని వాసుదేవరావు గ్రామసభలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేస్తుందని భూ సమస్యలను పరిష్కరించి క్యూఆర్ కోడ్ కలిగిన ఈ పాస్ పుస్తకాలను గ్రామసభల ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వగ్గంపల్లి మాజీ సర్పంచ్ దేవన బోయిన సుబ్బయ్య, గ్రామ టిడిపి అధ్యక్షులు బైరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు మాజీ ఉపసర్పంచ్ చావా సుబ్బారావు, టిడిపి మండల మాజీ ఉపాధ్యక్షులు రెక్కల వెంకటరమణారెడ్డి, భూత్ ఇంచార్జ్ చావా రాజేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ ఎలికా నాగ శేషులు, బైరెడ్డి సుధాకర్ రెడ్డి, చావా హరికృష్ణ, హజరత్ వలి, నాయబ్ , సైఫుల్ల,వీఆర్వో కుమార్, రీ సర్వే డిటి లావణ్య, ఆర్ ఐ పురుషోత్తం రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buildings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.